ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం

◆ రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సమగ్రాభివృద్ధికి ప్రతిబంధకం ◆ సంస్కరణలతో పెరిగిన అసమానతలు

◆ 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న నారాయణరాజు, వేదికపై లోకనాథం, నర్సింగరావు, తులసీదాస్, సురేంద్ర తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్రలో వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం ప్రస్తుతం నడుస్తోందని పలువురు వక్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సమగ్రాభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్నాయని విమర్శించారు. సంస్కరణల ప్రభావంతో నానాటికీ అసమానతలు పెరుగుతున్నాయన్నారు. శనివారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై సదస్సు జరిగింది. నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ జరుగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి వ్యూహమే రాష్ట్రంలోని ప్రాంతాల అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉందని తెలిపారు. వనరులున్నా వాటిని కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం ప్రజల్లో ఆర్థిక అసమానతలను పెంచిందని అన్నారు. తొలుత విజన్ 2020 అన్న చంద్రబాబు రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించిందీ లేదు, ఉద్యోగాలు తెచ్చిందీ లేదని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్రపై 1991 నాటి సంస్కరణల ప్రభావం పడిందని, గ్రామీణ ప్రాంత ప్రజలు జీవనావసరాలను నేటికీ తీర్చుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు.

ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ యు.నారాయణ రాజు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదన్నారు. 1983లో విజయనగరం జిల్లాలో తాను ఇంజినీరుగా పనిచేసినప్పుడు జంఝావతి ప్రాజెక్టుకు రూ.7 కోట్లతో అంచనా వేయగా ఇప్పుడు రూ.250 కోట్ల అంచనాకు చేరిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో భూసేకరణకు సంబంధించిన రికార్డుల నిర్వహణే సరిగ్గా లేదని తెలిపారు. రాజకీయ నాయకుల అవగాహనా రాహిత్యం, సరిపడా నిధులను మిగతా 2లో..


అవార్డు స్వీకరిస్తున్న హరేంధిర ప్రసాద్

కలెక్టర్‌కు.. బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు - 2024 లభించింది. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా కలెక్టర్ సంబంధిత అవార్డును అందుకున్నారు. అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా మిగతా 2లో..

విష్ణు కెమికల్‌లో కార్మికుడు మృతి

▶ వార్త 2లో..

బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

▶ వార్త 2లో..

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

▶ వార్త 7లో..

అశ్లీల వీడియోలు చూపి బెదిరింపులు

◆ లైంగిక దాడి, నగదు కాజేత

◆ నిందితుడు అరెస్టు, రిమాండ్

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు వలంద పేటకు చెందిన 15 ఏళ్ల కుమార్తె అశ్లీల వీడియోలు చూపి ఆమె తల్లిని 10 నెలలుగా బెదిరిస్తూ శారీరకంగా లోబర్చుకున్నాడు ఓ దుష్టుడు. రూ.5.60 లక్షలనూ కాజేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సిఐ సుధాకర్ కథనం ప్రకారం.. వలంద పేటకు చెందిన ఓ యువతి అశ్లీల వీడియోలు ఉన్నాయంటూ సమీప బంధువైన గాజువాకకు చెందిన గొరకా జానకీరావు 2024 నుంచి 10 నెలలుగా యువతి తల్లిని బెదిరించసాగాడు. తరచూ డబ్బులు పంపించాలని డిమాండ్ చేస్తూ ఉండేవాడు. 10 నెలల కాలంలో ఆమె రూ.5 లక్షలా 60 వేలు పంపించింది. అయినా కుమార్తె వీడియోలను సదరు వ్యక్తి డిలీట్ చేయలేదు. పైగా యువతి తల్లిని శారీరకంగా లొంగదీసుకున్నాడు. భర్తను విడిచిపెట్టి తనతో వచ్చేయాలని బ్లాక్ మెయిల్‌కు దిగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు జానకీరావును అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. జులై 2 వరకు రిమాండ్ విధించారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

◆ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ త్రివర్ణ శోభితం

◆ ముస్తాబయిన శకటాలు


విశాఖలో ముస్తాబయిన పోలీస్ పరేడ్ గ్రౌండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు శనివారానికే దాదాపు పూర్తయ్యాయి. ఏర్పాట్ల తీరును జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పరిశీలించారు. పరేడ్ మైదానాన్ని సందర్శించిన ఆయన అక్కడ ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రధాన వేదిక, ఓపెన్ టాప్ అలంకరణ, విఐపిల సీటింగ్, సామాన్య పౌరులు వేచి ఉండేందుకు అనుగుణంగా గ్యాలరీల ఏర్పాట్లపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న శకటాల తాజా పరిస్థితిని సమీక్షించిన ఆయన సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్టాళ్లు, వివిధ పరికరాలు, పత్రాల అందజేతకు సంబంధించిన స్టాళ్లను చూసిన ఆయన అక్కడ ఎలాంటి ఇబ్బందీ లేకుండా పక్కా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు చెప్పారు. మెయిన్ స్టేజీ వద్ద జరుగుతున్న అలంకరణ పనులను, విఐపి, మీడియా, సామాన్య పౌరులు కూర్చునే సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పబ్లిక్ అడ్రస్ సిస్టం, అవార్డుల బహూకరణ తదితర కార్యకలాపాలకు సంబంధించిన ఇన్‌ఛార్జి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పక్కా ఏర్పాట్లు చేసుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రదర్శనలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో తొమ్మిది శకటాలను ఏర్పాటు చేస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ విశాఖపై జివిఎంసి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై విద్యాశాఖ, ఎస్ఎస్ఎ, దీపం-2 పథకంపై సివిల్ సప్లైస్, నా ఆరోగ్యం - నా హక్కు అనే అంశంపై వైద్యారోగ్య శాఖ, పేదరికం లేని సమాజమే - మన ప్రభుత్వ ఆశయం అనే అంశంపై డిఆర్‌డిఎ, మహిళా సాధికారతను తెలియజేస్తూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పిఎం సూర్యఘర్ విశిష్టతను తెలియజేస్తూ ఇపిడిసిఎల్, ప్రగతికి 10 సూత్రాల స్వర్ణాంధ్ర సాకారం అనే అంశంపై గృహ నిర్మాణ శాఖ శకటాలను ప్రదర్శించేందుకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం

సకాలంలో ఖర్చు చేయకపోవడం, ప్రణాళికా లోపాలతో ఉత్తరాంధ్రలో రైతులకు మేలుచేసే పలు ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. ఉత్తరాంధ్రకు జీవనాడి సుజల స్రవంతి అని, రూ.7 వేల కోట్ల అంచనాతో తయారై నేడు రూ.22 వేల కోట్లకు అది చేరిందని అన్నారు. విచిత్రమేమంటే గత బడ్జెట్‌లో కేవలం రూ.10 వేలు మాత్రమే కేటాయించారన్నారు. పోలవరం ఎనిమిది ప్యాకేజీలు టెండర్లు క్లియర్‌గా ఉంటే రాజకీయ ప్రభావంతో పై నుంచి ఒక్కరికే టెండరు ఇచ్చేలా ప్రభుత్వం చేయడం దారుణమన్నారు.

సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అసమానతల్లేని అభివృద్ధి జరగాలని రెండేళ్ల క్రితమే సిపిఎం అభివృద్ధి ప్రణాళికలను రూపొందించిందన్నారు. చంద్రబాబు విజన్ -2047లో ప్రజల అభివృద్ధికి సంబంధించిన అంశాలేమీ లేవని తెలిపారు. ఆ విజన్ అమలైతే ఉత్తరాంధ్ర నాశనమవ్వడం ఖాయమన్నారు. బాబు దావోస్ వెళ్లి వెనక్కి వస్తూ.. భ్రమలు కల్పించే యత్నాలు చేస్తున్నారన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంత వనరులను దోచుకోడానికి 'విశాఖ నగరం' అభివృద్ధిని తరచూ తెరపైకి తెస్తున్నారని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రాంత అభివృద్ధిపై ఏళ్ల తరబడి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. విశాఖ తీరంలో మత్స్యకారులు ఒకప్పుడు రెండు మూడు కిలోమీటర్లు వెళితే చేపలు దొరికేవని, నేడు 100 మైళ్లు వెళ్తున్నారని తెలిపారు. కాలుష్య కారక పరిశ్రమలతో సముద్రం కలుషితమైపోతోందన్నారు. అన్నీ ఉన్నా ఉత్తరాంధ్ర అభివృద్ధిలో వెనక్కి నెట్టబడుతోందని ఆవేదన చెందారు. కనీసం విభజన చట్టం అమలై ఉండి ఉంటే ఉత్తరాంధ్ర కాస్తయినా అభివృద్ధి జరిగి ఉండేదన్నారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సురేంద్ర, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఎం.కృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, జి.కోటేశ్వరరావు, టి.సూర్యనారాయణ, డి.గోవిందరావు, కె.గంగునాయుడు, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు

నమోదు చేసుకునేందుకు నిర్వహించే వినూత్న కార్యక్రమాలు, ఓటర్లను చైతన్యం చేయటం తదితర అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్‌కు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో పశ్చిమ నియోజకవర్గ ఆర్ఓగా వ్యవహరించిన అప్పటి ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, భీమిలి ఎఆర్ఓగా సేవలందించిన పి.హరిదాసు, భీమిలి, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బిఎల్ఒలుగా ఉత్తమ సేవలందించిన కిరణ్మయి, అనురాధ సిఇఒ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

సన్నద్ధమవుతున్నాయి. సంబంధిత ఏర్పాట్లను ఇన్‌ఛార్జి అధికారి అయిన సాంఘిక సంక్షేమ శాఖ డిడి పర్యవేక్షిస్తున్నారు. అలాగే వివిధ రకాల ఉత్పత్తులను, కార్యక్రమాలను, సాధించిన ప్రగతిని వివరిస్తూ వ్యవసాయ, పశుసంవర్ధక, హార్టికల్చర్, ఎపిఎంఐపి, మత్స్యశాఖ, ఐసిడిఎస్, డ్వామా, ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు వివిధ పరికరాలు, పత్రాలను పలువురికి అందజేయనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లు సాగుతున్నాయి.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1444వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి కార్మికులు చేస్తున్న పోరాటం తప్పక విజయం సాధిస్తుందన్నారు. ఉద్యమాల ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇటీవల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందని తెలిపారు.

కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా పేద మధ్య తరగతి ప్రజలకు హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఆ పథకాల అమలులో పూర్తిగా విఫలం చెందిందని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని పేర్కొంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 'ఖాళీ బజానా' పేరిట ప్లేట్లు, గరిటెలు చేత పట్టి పెద్ద శబ్దంతో ప్రభుత్వాన్ని నిద్రలేపే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిసిసి పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అల్లిపల్లి సతీష్, సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో వెల్‌నెస్ క్లినిక్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో ఏర్పాటుచేసిన వెల్‌నెస్ క్లినిక్ సెంటర్‌ను గైనిక్ వార్డు వద్ద ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జబ్బులు లేని ఆరోగ్యకరమైన జీవనానికి పాటించాల్సిన పరిశుభ్రత, అలవాట్లపైనా, అదేవిధంగా క్యాన్సర్ నివారణ జీవనశైలి వంటి పలు సూచనలు, సలహాలు, క్లినిక్ విభాగానికి సంబంధించిన అంశాలతో వెల్‌నెస్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.బుచ్చిరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహ సందర్శనలో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రంలో బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖ వ్యాలీ స్కూలు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహాన్ని ఆమె శనివారం ఉదయం సందర్శించారు. మూడు రోజులుగా అక్కడ జరుగుతున్న పరిణామాల దృష్ట్యా హోం మంత్రి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తొలుత ఆమె గృహాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న పరిస్థితులను తెలుసుకున్నారు. బాలికలతో మాట్లాడారు. మూడు రోజులపాటు తమను ఇంటికి పంపించేయాలని బాలికలు చేసిన ఆందోళనను, అందుకు దారితీసిన పరిస్థితులను గృహ పర్యవేక్షణాధికారి సునీతను, సిబ్బందిని, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాలికల ఆందోళన విషయం తెలియగానే జిల్లా కలెక్టర్, తహశీల్దార్, పోలీసు అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకొని పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించినట్లు తెలిపారు. బాలికల సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలే తప్ప రాజకీయం చేసి కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి మాట్లాడటం వైసిపికి తగదన్నారు. ఇక్కడ జరిగినది చాలా సున్నితమైన విషయమన్నారు. ఇక్కడ ఉంటున్న బాలికలు వేర్వేరు ప్రాంతాల నుంచి, వేర్వేరు సమస్యలు, వారి వారి కుటుంబ నేపథ్యాలు బాగాలేక వచ్చినవారేనన్నారు. వారిలో కొంతమంది లైంగిక దాడులకు గురై డిప్రెషన్‌లో ఉంటారన్నారు. వారి సమస్యను గుర్తించి వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు కొంత మందిని ఇంటికి పంపించామని, మరి కొంతమందిని వేరే హోంకు తరలించామని అన్నారు. మరొక బాలిక విషయం కోర్టు పరిధిలో ఉండటం వల్ల వెంటనే పంపలేకపోతున్నామని తెలిపారు. ఈ విషయంపై వైసిపి రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఈ విషయం ఎవరూ గుర్తు చేయల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు సమస్య పరిష్కారమైందని, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకూడదనే గృహాన్ని సందర్శించానని తెలిపారు. గత ఐదేళ్లు వైసిపి అబద్ధాలతోనే గడిపేసిందన్నారు. ఇప్పుడూ అదే రీతిన ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందన్నారు. రామతీర్థం విషయంలో ముద్దాయికి, సాక్షికి తేడా తెలియకపోవడం బాధాకరమన్నారు. చంద్రబాబు దావోస్ పర్యటన విషయంలో కూడా ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు.


వివరాలు సేకరిస్తున్న హోం మంత్రి అనిత

ఈస్ట్ కోస్ట్ రైల్వే అత్యుత్తమ ప్రతిభ

గణతంత్ర దినోత్సవ సందేశంలో జిఎం పరమేశ్వర్ పంక్వాల్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్ తన గణతంత్ర దినోత్సవ సందేశాన్ని శనివారం మీడియాకు విడుదల చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే గడిచిన ఏడాది కాలంగా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ వచ్చిందన్నారు. ఎన్నడూ లేని విధంగా అన్ని జోన్లను వెనక్కి నెట్టి 200 మెట్రిక్ టన్నుల లోడింగ్ మైలురాయిని అధిగమించిందని తెలిపారు. 2024 డిసెంబర్ నాటికి రూ.17,324 కోట్ల ఆదాయం ఆర్జించిందని, అదేవిధంగా 6.9 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిందని పేర్కొన్నారు. రూ.1745 కోట్ల ఆదాయం ప్రయాణికుల రవాణా ద్వారానే సాధించినట్లు తెలిపారు. 12 కుంభమేళా ప్రత్యేక రైళ్లతో పాటు 1718 ప్రత్యేక రైళ్లను ఈ కాలంలో నడిపామన్నారు. సాధారణ రైళ్లకు 4545 అదనపు కోచ్‌లను జోడించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 276 కిలోమీటర్ల కొత్త రైలు మార్గం, డబులింగ్, మల్టీ ట్రాకింగ్ పనులు పూర్తయ్యాయన్నారు.

విష్ణు కెమికల్‌లో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పరవాడ, విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లా పరవాడ రాంకీ ఫార్మా సిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో శనివారం కన్వేయర్ బెల్టులో పడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రాజ్ వీర్ (20) మృతిచెందాడు. ఆయన మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కెజిహెచ్ మార్చురీ వద్ద రాజ్‌వీర్ మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబీకులను పరామర్శించారు. పరిశ్రమల్లో వరుస ప్రమాదాలతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఫార్మా కంపెనీల్లో భద్రతా చర్యలు మృగ్యంగా మారాయన్నారు. మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ధాన్ ఆధ్వర్యాన వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ధాన్ వైజాగ్ రీజియన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 'అభివృద్ధి - భాగస్వామ్యం' అనే అంశంపై బీచ్ రోడ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. 1400 మంది కళంజియ మహిళలు పాల్గొన్నారు. సబ్‌మెరైన్ సెంటర్, వుడా పార్క్, ఎంజిఆర్ గ్రౌండ్ ప్రాంతాల్లో వాక్‌థాన్ సాగింది. కార్యక్రమాన్ని 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, జివిఎంసి 19వ వార్డు స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ నూకరత్నం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎంజిఆర్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన జీవీఎంసీ యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి మాట్లాడుతూ కళంజియ మహిళలంతా ఎంతో క్రమశిక్షణగా తమ ఆర్థిక అభివృద్ధి కోసం మాత్రమే కాకుండా సామాజిక అవగాహనతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వంగా ఉందని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు మహిళలంతా కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథి, బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ మురళీ మాట్లాడుతూ కళంజియ ఆర్థిక కార్యక్రమాలతో పాటు ఆరోగ్య, జీవనోపాధి, విద్యా కార్యక్రమాలలో సైతం ముందు పీఠిన నిలవడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్, ధాన్ వైజాగ్ రూరల్ రీజియన్ కో ఆర్డినేటర్ శ్రీ రామ్ కుమార్, అర్బన్ అండ్ కోస్టల్ రీజనల్ కోఆర్డినేటర్ ధనలక్ష్మి, ఫిషరీస్ డైరెక్టర్ లక్ష్మణరావు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కిషోర్ గుప్తా, యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ హెడ్ నిచెల్ల జాని, క్యూర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ లోకేష్, వివిధ సమాఖ్యల నాయకులు వెంకటరత్నం, గౌరి, దివ్య, సబిదా, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

సేవాభావంతోనే నర్సింగ్ వృత్తిలో రాణింపు



లైటింగ్ ల్యాంప్‌లో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : సహనం, సేవాభావంతో నర్సింగ్ వృత్తిని చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ నర్సస్ అండ్ మిడ్‌వైఫరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి బిఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం నర్సింగ్ వృత్తి ప్రతిజ్ఞ, లైటింగ్ ల్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య రంగం విస్తరిస్తున్న కొద్దీ నర్సింగ్ వృత్తికి డిమాండ్ పెరుగుతుందన్నారు, ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో నర్సింగ్ వీత్తికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ నర్సింగ్ విద్యలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం గీతం లక్ష్యం అన్నారు. జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు మాట్లాడుతూ రోగుల పట్ల సహనం ప్రేమతో వ్యవహరించేవారు ఈ వృత్తిలో విజయం సాధిస్తారని తెలిపారు. గీతం నర్సింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటేషన్ బాలు మాట్లాడుతూ ఆంధ్ర, కేరళ, తమిళనాడు, ఒడిశా, మణిపూర్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచే కాక నేపాల్ వంటి దేశాలనుంచి వచ్చిన విద్యార్థినులు తమ వద్ద నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిమ్‌సర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఆర్.వసంతకుమార్, సహాయ ప్రొఫెసర్ జి.రోషిణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నర్సింగ్ విద్యార్థులు వృత్తిని అంకిత భావంతో చేపడతామని కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఉత్సాహంగా కేరమ్స్ ఆడుతున్న విద్యార్థులు

చెస్, కేరమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకలను పురస్కరించుకుని పాఠశాలలో శనివారం చెస్, కేరమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరుగనున్న వేడుకలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రమణ, వేడుకల నిర్వహణ కమిటీ చైర్మన్ జి.అప్పలనాయుడు, కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, కార్యదర్శి ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సత్చిదానందమూర్తికి నివాళి

ప్రజాశక్తి-విశాఖపట్నం : పద్మ విభూషణ్ ఆచార్య కొత్త సత్చిదానందమూర్తి 15వ వర్ధంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయ తత్త్వశాస్త్ర విభాగంలో నిర్వహించారు. ముందుగా సత్చిదానందమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, తత్త్వశాస్త్ర విభాగం ఆచార్యులుగా పనిచేసిన సత్చిదానందమూర్తి ప్రపంచ స్థాయిలో ఖ్యాతి గడించి, అనేక తత్త్వశాస్త్ర గ్రంథాలను రచించారని తెలిపారు. తత్త్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు మాట్లాడుతూ, మార్చి నెలలో సత్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు కృష్ణయ్య, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి తోటవీధిలో దివీస్ ఆధ్వర్యాన శనివారం సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశారు. వలలు మరమ్మతు చేసుకునేందుకు, వేటకు వెళ్లి వచ్చే మత్స్యకారులు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఈ బెంచీలు ఉపయోగపడతాయని దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. తాము అడిగిన వెంటనే సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేసిన దివీస్ యాజమాన్యాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



తోటవీధిలో ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలు

పిహెచ్‌సికి మెడికల్ కిట్లు వితరణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవేర్ గ్రూప్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లంకి సహకారంతో మెడికల్ కిట్లను ఉచితంగా అందజేశారు. పేషెంట్ వెయిటింగ్ కుర్చీలు రెండు, ఆటో క్లేవ్-1, బేబీ వార్మర్ 1, ఇంజక్షన్ ట్రాలీ 1, ఆధునిక బీపీ ఆపరేటర్లు రెండు, ఒక పేషెంట్ టేబుల్ తదితర సుమారు రూ.3 లక్షలు విలువ చేసే సామాగ్రిని అందజేశారు. సిఎస్ఆర్ నిధులతో వీటిని అందించినట్లు ఎస్‌బిఐ మేనేజర్ కె.వెంకట శ్రీధర్ తెలిపారు. వైద్య పరికరాలు అందించిన వెల్లంకి శాఖ మేనేజర్ కె.వెంకటశ్రీధర్‌కు, అవేర్ సంస్థ చైర్మన్ జి.మాధవన్‌కు, అవేర్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వరుణ్‌కు పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.గంగునాయుడు, షహనాజ్ సాధియ, కృష్ణమోహన్, సిబ్బంది, స్థానిక నాయకులు కోరాడ అచ్యుత్ రాంబాబు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



మెడికల్ కిట్లు అందజేసిన ఎస్‌బిఐ మేనేజర్

పాడేరులో గీతం వైద్య శిబిరాలు



వైద్యసేవలపై అవగాహన కల్పిస్తున్న గీతం వైద్యులు

ప్రజాశక్తి -మధురవాడ : కమ్యూనిటి రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్‌ఆర్‌సి)లను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో ఏర్పాటు చేసిందని గీతం ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ స్వాతి చిక్కాల తెలిపారు. పాడేరు మండలంలోని ఐనాడ, దేవపురం గిరిజన గ్రామాలలో శనివారం ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కోవిడ్ అనంతరం ప్రజలలో చైతన్యం తేవడానికి డిఎస్‌టి నిపుణులు డాక్టర్ కొంగ గోపీకృష్ణ పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా కమ్యూనిటి రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్‌ఆర్‌సి)లు ఏర్పాటవుతున్నాయని చెప్పారు. ఈ శిబిరానికి దాదాపు 650 మంది గిరిజనులు హాజరయ్యారని తెలిపారు. వైద్య శిబిరంతో పాటు స్థానికలకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్లు కృషి విజ్ఞాన కేంద్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ అభిప్రాయపడ్డారు. జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి సహకారం అందించారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి తల్లీ కూతురు ఆత్మహత్య

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు పరిధి ఆదర్శనగర్ గొల్లవీధిలో ఉంటున్న మహంతి మాధవి (25) పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడడమే గాకుండా తన ఐదేళ్ల కుమార్తె ఇషిత, 18 నెలల కుమార్తె రితిక్షకు కూడా పురుగుల మందు తాగించింది. ఈ ఘటనలో తల్లి మాధవి, చిన్న కుమార్తె రితిక్ష మృతి చెందారు. పెద్ద కుమార్తె ఇషిత అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులను కలచి వేసే ఈ ఘటనకు సంబంధించి సిఐ సుధాకర్ కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం, మదనాపురానికి చెందిన మహంతి మాధవి (25)కి రామకృష్ణతో 2019 మార్చి 23న పెద్దల సమక్షంలో పెళ్లైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఇషిత (5), రితిక్ష (18 నెలలు) ఉన్నారు. మృతురాలు మాధవి భర్త చిప్పాడ దివీస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 1 గంట సమయంలో తల తిరుగుతుందని సొంతూరు శ్రీకాకుళంలో ఉన్న తండ్రి బాణాల గణపతిరావుకు మాధవి ఫోన్ చేసింది. మధ్యలో ఫోన్ వాయిస్ బ్రేకవ్వడంతో అనుమానం వచ్చిన తండ్రి కుటుంబ సభ్యులను తగరపువలసలో ఉంటున్న కుమార్తె ఇంటికి పంపించారు. అప్పటికే తల్లి, ఇద్దరు కుమార్తెలు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లగా శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మాధవి, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కుమార్తెల్లో చిన్న కుమార్తె 18 నెలల రితిక్ష మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందారు. పెద్ద కుమార్తె చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మధ్య కాపురం సవ్యంగానే ఉండేదని, ఈ నెల 24వ తేదీన భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవతో ఈ దారుణం జరిగినట్లు భావిస్తున్నట్లు మృతురాలు మాధవి తండ్రి గణపతిరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ జి.హరీష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

6 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారం - 1కు సమీపంలో గంజాయితో ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన షేక్ సాహుల్, మోట నవీన్ పట్టుబడ్డారు. జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శాంతారామ్, ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో రైల్వే స్టేషన్‌లో ఎప్పటిలాగే శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు చిక్కారు. వారి నుంచి రూ.30 వేల విలువగల 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

హనీ ట్రాప్ కేసులో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 18న జరిగిన హనీ ట్రాప్ దోపిడీ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామని, వారిలో ఓ మహిళ కూడా ఉందని విశాఖపట్నం క్రైమ్ డిసిపి కె.లతా మాధురి తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన బాధితుడు తనకు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా భీమిలి సమీపంలోని ఒక ప్రాంతానికి వెళ్లాడు. అక్కడకు చేరుకున్న ఆరుగురు నిందితులు అతన్ని బెదిరించారు. రూ.50 వేల నగదు, ఫోన్‌ను లాక్కున్నారు. అకౌంట్‌లోని సొమ్మునూ కాజేశారు. బాధితున్ని తీవ్రంగా కొట్టి వెళ్లిపోవడంతో అతడు భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించారు. రూ.58,900 నగదు, సెల్‌ఫోన్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. శనివారం కోర్టులో వారిని హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో అరెస్టు అయిన ఏడుగురు నిందితులలో నలుగురిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని లతా మాధురి తెలిపారు.

గ్రావెల్ ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సమీపంలో అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా శనివారం సాయంత్రం గ్రావెల్ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్‌లో రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

రాజకీయాల నుంచి తప్పకుంటే ప్రక్షాళన అయిపోతుందా..?

విజయసాయిరెడ్డి రాజీనామాపై భీమిలి ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాజకీయాల నుంచి తప్పుకున్నంత మాత్రాన విజయసాయిరెడ్డి చేసిన పాపాలు ప్రక్షాళన అయినట్టు కాదని, ఆయన సాగించిన విధ్వంసాలతో నష్టపోయిన వారికి సమాధానం చెప్పాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ, కాకినాడ పోర్టు మాదిరిగా దసపల్లా భూములు సహా విశాఖ భూ దందాలపై ఫిర్యాదులు వస్తే సాయిరెడ్డిపై చట్టబద్ధమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వైసిపి పాలనలో విశాఖ ఇన్‌ఛార్జిగా ఉన్న విజయసాయిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, వారి కంపెనీల పేరు మీద భీమిలి నియోజకవర్గంలో 2 లక్షల గజాల భూములను కొట్టేశారన్నారు. నరసింహస్వామి కొలువై ఉన్న తర్లువాడ కొండను కుమార్తె విద్యాసంస్థ కోసం హస్తగతం చేసుకోవాలని ప్రయత్నించడం సాయిరెడ్డి భూదాహానికి పరాకాష్ట అని అభివర్ణించారు. గీతం కాలేజీ గోడ, భవనాలు, తన అల్లుడు ఫార్మ్ హౌస్, పల్లా శ్రీనివాసరావు, పీలా గోవింద సత్యన్నారాయణ భవనాలు, సిరిపురంలోని హర్ష వర్ధన్ ప్రసాద్ రెస్టారెంట్ అకారణంగా కూల్చివేశారని గుర్తుచేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దసపల్లా, రేడియంట్, ఎన్‌సిసి, రామానాయుడు స్టూడియో భూములు, రాడిసన్ రిసార్ట్స్ లలో జోక్యం చేసుకుని, వాటి యజమానులను గుప్పిట్లో పెట్టుకుని లబ్ధి పొందారని ఆరోపించారు. చంద్రబాబు కుటుంబంతో విభేదాలు లేవని, పవన్ కల్యాణ్‌తో చిరకాల స్నేహం ఉందని ట్వీట్‌లో పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. తాను ముందు నుంచి చెబుతున్నట్టు వైసిపి మునిగిపోయిన నావ అని, ఇంకా అనేకమంది ఆ పార్టీకి రాజీనామాలు చేయబోతున్నారని తెలిపారు. అందులో చివరికి జగన్మోహన్ రెడ్డి ఒక్కరే మిగులుతారన్నారు ఈ మీడియా సమావేశంలో జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, కూటమి నాయకులు గాడు అప్పలనాయుడు, మొల్లి లక్ష్మణరావు, కె.దామోదరరావు, త్రినాథ్, యర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లకు శిక్ష తప్పదు : ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి -గాజువాక : ఆర్థిక నేరగాళ్లకు శిక్ష తప్పదని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విజయసాయిరెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. గాజువాకలో ఒక ప్రయివేట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక నేరాల్లో ముద్దాయిగా ఉన్న విజయసాయి రెడ్డికి రాజకీయంలో స్థానం లేదన్నారు. ఆయన రాజీనామా శుభ పరిణామం అని పేర్కొన్నారు. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకొని దోచుకొని అనేక ఆర్థిక లావాదేవీలకు పాల్పడ్డారని తెలిపారు. గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు ఇన్‌ఛార్జిగా ఉంటూ, షాడో ముఖ్యమంత్రిగా వ్యవహరించి అనేక అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆస్తులు ఇవ్వకపోతే దాడులు చేయడం, పార్టీలోకి రాకపోతే వారి వ్యక్తిగత ఆస్తులను విధ్వంసం చేయడం వంటి కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన రాజీనామా చేసినప్పటికీ శిక్ష తప్పదన్నారు. ఆయన రాజీనామాతో వైసిపికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్‌ను శనివారం పలువురు అధికారులు సందర్శించారు. మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ రైతుబజార్‌ను సందర్శించి మాట్లాడుతూ, రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిల్లర సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

జివిఎంసి అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ సీతమ్మధార రైతు బజార్‌ను సందర్శించి రైతులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వివరించారు. రైతు బజార్‌లో ఉన్న రైతులకు, తోపుడు బండ్ల వర్తకులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, జోన్-3 హెల్త్ ఆఫీసర్ ప్రసాదరావు, రైతు బజార్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలను అందిస్తున్న కోరమండల్ సంస్థ ప్రతినిధులు

విజయవంతంగా ఇండస్ట్రీ బెస్ట్ సేఫ్టీ ప్రాక్టీస్

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఇండస్ట్రీ బెస్ట్ సేఫ్టీ ప్రాక్టీస్ సెషన్స్ శనివారం కంపెనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా చర్యలపై జాగ్రత్తలను హెచ్ఆర్ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు జ్ఞాన సుందరం, ఎం.శ్రీనివాసరాజు, డి.నాగరాజు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో బొండా జగన్నాథం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 87 వార్డు పరిధిలో సుమారు రూ.75 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొండా జగన్నాథం శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఇండోర్ స్టేడియం, ప్రధాన గెడ్డను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రెండు నెలల్లో సుమారు రూ.పది కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. స్మార్ట్ వార్డుగా అభివృద్ధి చేస్తానన్నారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్‌ను ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్‌రాజు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ విజయరామరాజు, జనసేన వైస్ ప్రెసిడెంట్ కర్రి నరసింగరావు, ఇందిరా ప్రియదర్శిని, సీనియర్ నాయకులు ఆనంద్ కుమార్, ద్రోణాద్రి అప్పలనాయుడు, కనక సత్యం, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య రహితంగా గ్రామం

ప్రజాశక్తి-పెందుర్తి : ఇంటిని శుభ్రం చేసుకున్న మాదిరిగానే గ్రామాన్ని పారిశుధ్యంగా రహితంగా చూసుకోవాలని డిపిఒ నాగేశ్వరరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో తడి -పొడి చెత్తపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పారిశుధ్య కార్మికులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు చెత్తను ఏ విధంగా వేరు చేసి అందించాలో ఇప్పటికే తెలియజేశామని చెప్పారు. కొన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. గ్రామంలో వ్యర్థాన్ని క్రమపద్ధతిలో చెత్త నుంచి సంపద కేంద్రానికి సక్రమంగా తరలించే చర్యలు తీసుకోవాలని కోరారు. పొడి చెత్తను ఎమ్ఆర్ఎఫ్ (మెటీరియల్ రిసోర్స్ ఫెసిలిటేషన్ సెంటర్)కు తరలించి తద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట్రావు, ఎంపిపి మధుపాడ నాగమణి, జడ్‌పిటిసి సభ్యులు ఉప్పులు దేవి, ఎఒఆర్‌డి అప్పలరాజు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

'మద్యం షాపుల కేటాయింపులో యాతలకు అన్యాయం'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపి ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపుల్లో యాతలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం కల్లుగీత వృత్తిదారుల జీవనోపాధి మెరుగు పర్చుటకు మద్యం షాపులు ఏర్పాటుచేయాలని ఆలోచన చేసిందని ఆ లక్ష్యం ఈ కేటాయింపుల అనంతరం నీరుగారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. మద్యం షాపులు కేటాయించినప్పుడు నూతన సమగ్ర జనగణన ఆధారంగా కేటాయిస్తారని, కానీ ఇప్పుడు కేటాయించిన మద్యం షాపుల విషయంలో ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. 2016లో జరిపిన పల్స్ సర్వే ఆధారంగా చేస్తున్నట్లు జిఒలో పొందుపర్చారని తెలిపారు. సంబంధం లేని కులస్తులకు ఈ షాపుల కేటాయింపు జరిగిందన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 95 శాతం మంది యాతకులస్తులు ఉండే ప్రాంతంలో యాతలకు కేవలం ఐదు షాపులు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐదు శాతం ఉండే శెట్టిబలిజలకు తొమ్మిది షాపులు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. యాతల కోసం ప్రత్యేకంగా 20 నుంచి 30 వరకు షాపులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. షాపుల నిర్వహణకు ధరావత్తు సొమ్ము రూ.2 లక్షలు చెల్లింపు అనేది యాతలకు కష్టతరమైన పని అన్నారు. అత్యధిక పేదరికంలో ఉన్న యాతలు రూ.2 లక్షలు డిపాజిట్ చేయడం సాధ్యం కాదని, యాతలకు మద్యం షాపులు కేటాయించేటప్పుడు సిండికేట్ విధానం లేక ఉమ్మడి సొసైటీ విధానం పాటించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి మద్యం షాపులు కేటాయింపులపై పునరాలోచన చేయాలని, లేకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి నూకరాజు

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఏర్పాటుచేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులతో అన్ని సబ్జెక్టులకు సంబంధించి సైన్స్ ఫెయిర్‌ను పాఠశాల యాజమాన్యం ఏర్పాటుచేసింది. గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకురావడానికి పాఠశాల బస్సులను కూడా ఏర్పాటుచేశారు. ఒక ప్రత్యేక గదిలో ప్రొజెక్టర్ ద్వారా అంతరిక్ష ప్రయోగాలను విద్యార్థులకు చూపించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 16 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని పాఠశాల యాజమాన్య ప్రతినిధి ఆలివర్ రాయ్ తెలిపారు.


పిఎం విశ్వకర్మ పథకంపై సందేహాలను నివృత్తి చేస్తున్న చంద్రమౌళి

టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల సమస్యలపై వినతి


మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రవ్యాప్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు సారధ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణకు, పట్టణ పరిపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌కుమార్‌కు, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జె.విద్యుల్లతకు వినతిపత్రాలు అందజేశారు. టిపిఒలకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా, అసిస్టెంట్ డైరెక్టర్లను డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రమోషన్ కల్పించాలని మంత్రిని కోరినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి వెంటనే ఫైల్ సిద్ధం చేయాలని డైరెక్టర్‌ను ఆదేశించారన్నారు. ముఖ్య కార్యదర్శి కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో పట్టణ ప్రణాళిక విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, అధికారులు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మంత్రి పి. నారాయణ టౌన్ ప్లానింగ్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సత్తారు హరిదాసు, కార్యదర్శి మోహన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బెగ్, వెంకటరావు, పి.నాయుడు, వెంకటరమణ, రఘునాథరావు, వినయ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రజకులు, బోటు మేకర్లకు అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లోని వాసవ కార్యాలయంలో శనివారం రజకులకు, బోటు మేకర్లకు అవగాహన-కమ్-రిజిస్ట్రేషన్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, విశాఖపట్నం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు మాట్లాడుతూ, ఈ శిబిరానికి 86 మంది హాజరైనట్లు తెలిపారు. వాసవ అధ్యక్షుడు పాండురంగప్రసాద్ మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థలో సంప్రదాయ వృత్తుల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. సంప్రదాయ వృత్తిలో తాజా సాంకేతికతను ఉపయోగించుకోవాలని కోరారు. జివిఎంసి యుసిడి ఎపిడి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, స్టేజ్ 1 వద్ద పిఎం విశ్వకర్మ దరఖాస్తులను త్వరగా ఆమోదిస్తామని తెలిపారు. ఎంఎస్ఎంఇ డిఎఫ్ఒ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ, పిఎం విశ్వకర్మ పథకంపై సందేహాలను నివృత్తి చేశారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ పరిధిలో ఉన్న తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో గణతంత్రదినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యాలయాల్లో మూడు రంగుల జెండాలను అంటించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు తహశీల్దార్ సన్మానించి అవార్డుల పురస్కారానికి ఏర్పాట్లుచేస్తున్నారు.

పాడి రైతులకు విశాఖ డెయిరీ మరో షాక్!

- ప్రతి రైతు నుండీ 90 శాతం ఆవు పాలే సేకరణ - 10 శాతం వెనక్కి ఇచ్చేయడంపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

విశాఖ డెయిరీ యాజమాన్యం పాడి రైతులకు పెద్ద షాక్ ఇచ్చింది. ఆవుపాల రైతులను మరోసారి మోసం చేసింది. గతంలో ఆవు పాలు సేకరణ ధర లీటరుకు నాలుగు రూపాయలు తగ్గించిన విశాఖ డెయిరీ యాజమాన్యం, ఇప్పుడు రైతు విశాఖ డెయిరీకి సరఫరా చేస్తున్న పాలులో 90 శాతం మాత్రమే డెయిరీ తీసుకొని, 10 శాతం పాలు వెనక్కి ఇస్తేస్తుంది. దీంతో డెయిరీ యాజమాన్యం తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత కొద్ది రోజుల క్రితం విశాఖ డెయిరీ ఆవుపాల ధరలను లీటర్‌కు 4 రూపాయలు తగ్గించడంతో రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా శనివారం ఉదయం నుండి రైతులు సరఫరా చేసే పాలులో 10 శాతం పాలను రైతులకు వెనక్కి తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించారు. విశాఖ డెయిరీ పరిధిలో రైతులు అధిక మొత్తంలో ఆవులను పెంచుతూ పెద్ద మొత్తంలో ఆవుపాలను విశాఖ డెయిరీకి సరఫరా చేస్తున్నారు. విశాఖ డెయిరీ అవసరానికి మించి ఆవు పాలు సరఫరా అవుతుండడంతో ఆవు పాలు సేకరణను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో విశాఖ డెయిరీ యాజమాన్యం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటుందని తెలుస్తోంది. విశాఖ డెయిరీ తాజా నిర్ణయంతో మండలంలోని పలు విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాల్లో రైతులు సరఫరా చేసే ఆవు పాలులో 10శాతం వెనక్కి ఇచ్చేశారు. డెయిరీ ప్రోత్సాహంతోనే ఇప్పటి వరకు ఆవులను మేపుతున్నామని, ఇప్పుడు అర్ధాంతరంగా ఇలా పాల ధరలు తగ్గించడం, పాలు పూర్తి స్థాయిలో తీసుకోకపోవడం వంటి చర్యలు వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెయిరీ యాజమాన్యం తన నిర్ణయాన్ని పున:పరిశీలన చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



వెనక్కి ఇచ్చేసిన పాలు చూపుతున్న రైతు రామారావు

రైతుల ఆందోళన

అచ్యుతాపురం : పాల సేకరణ తగ్గిస్తున్న విశాఖ డెయిరీ నిర్ణయంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మరాజుపేట గ్రామంలో శనివారం రైతులు వద్ద నుంచి సేకరించే పాలను తగ్గించడంపై సంఘ ఆవరణలో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తీవ్ర నష్టం

నేను గత కొంతకాలంగా ఆవులను పెంచుతున్నాను. సుమారు రెండు లీటర్లు ఆవుపాలను సరఫరా చేస్తుంటాను. శనివారం శనివారం ఆవు పాలను తీసుకెళ్లగా రెండు లీటర్ల పాలలో 200 మిల్లీలీటర్ల పాలను వెనక్కి ఇచ్చేశారు. ఇలా ఆవుపాల రైతులందరికీ ఈ విధంగా చేస్తున్నారు. ఆవుపాలను వెనక్కి ఇవ్వడం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. యాజమాన్యం పరిశీలించాలి.

- జెర్రిపోతల రామారావు, రైతు, బిబ్బిడి, బుచ్చయ్యపేట మండలం

పాడి రైతులను మోసం చేస్తున్న విశాఖ డెయిరీ

కె.కోటపాడు : విశాఖ డెయిరీ ఆవుపాల రైతులను మరోసారి మోసం చేసిందని ఏపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, నాయకులు రొంగలి ముత్యాలనాయుడు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఆవు పాల రేటు లీటరుకు నాలుగు రూపాయలు తగ్గించి, ఇప్పుడు 10శాతం పాలు వెనక్కి ఇచ్చేడం దారుణమన్నారు. కూటమికి పాడి రైతాంగం ఓట్లు వేసి గెలిపిస్తే రైతులను ముప్పుతిప్పలు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా రైతులపై ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకొని విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతిపై అసెంబ్లీ హౌస్ కమిటీ ద్వారా విచారణ చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతులకు సబ్సిడీ మీద దాణా పంపిణీ చేయాలని, ఆవు పాలు లీటరుకు రూ.50, గేదె పాలు లీటరుకు రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎర్రదేముడు, గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన టెన్త్ నమూనా పరీక్ష

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలో 10వ తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష శనివారం నిర్వహించారు. నమూనా ప్రశ్నాపత్రాన్ని అచ్యుతాపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం పద్మావతి చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిర్వహించే నమూనా పరీక్ష విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను తెలుసుకోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. ఈ నమూనా పరీక్షకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ శాస్త్రి నూకరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు కృప, రాము, లక్ష్మణ్, గణేష్, వరుణ్, రవి, స్కూల్ చైర్మన్ తాతారావు, సిఐటియు మండల కన్వీనర్ కే సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రామాలాడుతున్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసీపీలో ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జిగా పాలన వ్యవహారాల్లో కనుసైగతో శాసించి, విశాఖలో మూడున్నర సంవత్సరాలు వైకాపా అంటే విజయసాయిరెడ్డి అన్నట్టుగా ఆయన హవా సాగిందని, ఇప్పుడు రాజీనామా డ్రామాతో చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి, కేసులు నుండి బయటపడడానికి హై డ్రామా నడుపుతున్నారని మాజీ శాసనమండలి సభ్యులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీలో చేయకూడని పాపాలన్నీ చేసి, ఇప్పుడు రాజకీయ వైరాగ్యాన్ని ప్రదర్శించి వ్యవసాయం చేసుకుంటానని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని నాగ జగదీష్ వ్యాఖ్యానించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన హిందీ పరీక్షల్లో హరిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపాద రవి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. హిందీ పండితులు షేక్ బాషాను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు హిందీ పరీక్షల్లో పాల్గొని శత శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ధర్మిరెడ్డి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1న గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో ఫిబ్రవరి 1వ తేదీన జరిగే గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు మహోత్సవానికి సంబంధించిన గోడ పత్రికను ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా 29న బుధవారం 4 గంటలకు సారె ఊరేగింపు ఉంటుందన్నారు. 1వ తేదీ శనివారం ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు, రాత్రి కోలాటం, తాడిపెద్దు సేవాగరిడీలు, సంప్రదాయం నృత్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తోటివారికి ఆదర్శంగా ఉండాలి

ప్రజాశక్తి-కశింకోట : విద్యార్థులు తోటి వారికి ఆదర్శంగా ఉండాలని కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్ డైరెక్టర్ బి.నోబెల్ కుమార్ అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో 10, 12 తరగతుల విద్యార్థులకు శనివారం సాయంత్రం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ గ్రామానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు

జిల్లా ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

డాక్టరుపై చర్యలకు ఆదేశాలు



బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. స్థానిక ఎన్.టి.ఆర్. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ శనివారం ఆకస్మిక తనిఖీ చేసారు. ప్రసూతి వార్డులో చికిత్స నిమిత్తం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో జిల్లా కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేసి, విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో రోగులు, ప్రసూతి వార్డులో బాలింతలతో జిల్లా కలెక్టరు నేరుగా మాట్లాడారు. ఆసుపత్రి సిబ్బందిని విచారించారు. విచారణ అనంతరం గైనిక్ వార్డులో విధులు నిర్వహిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ సి హెచ్.శోభాదేవిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంటు, ఇంచార్జి డిసిహెచ్ఎస్ ఎస్.శ్రీనివాసరావును ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారుల ప్రదర్శించిన నేలవేషాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, విశాఖ డైరీ మాజీ డైరెక్టర్ మలసాల రమణారావు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ ఎస్ ధర్మారావు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జ్ జూనియర్ ఎడిషన్ రమేష్, విజయలక్ష్మి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నూకాంబిక దేవస్థానం తరపున అమ్మవారికి సారె సమర్పణ

శ్రీనూకాంబిక దేవస్థానం తరపున గౌరీ పరమేశ్వరులకు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతులమీదుగా సారె సమర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, డిఎస్పి శ్రావణి, కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కొణతాల శ్రీనువాసరావు, కొణతాల నూకమహలక్ష్మినాయుడు, కొణతాల మురళీకృష్ణ, పివి రమణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొణతాలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



శేషమ్మకు నివాళులర్పిస్తున్న మలసాల రమణారావు

శేషమ్మకు మలసాల నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ డెయిరీ మాజీ డైరెక్టర్, వైసిపి నేత మలసాల రమణారావు శనివారం అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన వైస్సార్సీపీ నాయకులు బొండా సూరిబాబు తల్లి బొండా శేషులమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. శేషమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి లర్పించారు. కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి మండలం అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, ఉపాధ్యక్షులు నోట్ల శ్రీనివాసరావు, శంకరం సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ,గుడాల ఆనంద్, రేబాక ప్రసాద్ పాల్గొన్నారు.

సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ రామకృష్ణ కోరారు. శనివారం మరిడిమాంబ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా వినియోగదారులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పరవాడ మండలంలో 38 మంది డబ్బులు చెల్లించారని తెలిపారు. సోలార్ ఎనర్జీ 7 శాతం ఇస్తామని, 10 శాతం చెల్లించాలని దాదాపుగా నెలకు 1500 వందలు రూపాయలు బిల్లు చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. ఏడి కనకారావు మాట్లాడుతూ సోలార్ పథకం పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పరవాడ గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు మాట్లాడుతూ పరవాడ గ్రామాన్ని సోలార్ ఆదర్శ గ్రామముగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈ శేష సాయి, కూటమి నేతలు కూండ్రపు సీతారామయ్య, శ్రీరామ్మూర్తి, వియ్యపు చిన్న పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని వెదురువాడ గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను గ్రామస్తులను ఆహ్లాదపరిచారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలతో గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ సాయి వరకు గుర్తింపు సాధించవచ్చని తెలిపారు. పండగలలో అశ్లీల నృత్యాలకు బదులు ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 క్రికెట్ టీములు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ నుండి ఈ విద్యా సంవత్సరంలో ఆర్చరీ, షూటింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్, వుషు క్రీడాంశాల్లో జాతీయ స్థాయిలో పాల్గొన్న 18 మంది క్రీడాకారుల అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ మల్లిఖార్జున రావు చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్లు బహూకరించి, క్రీడాకారులను అభినందించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ పాఠశాల విద్యతో పాటు క్రీడలకు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈఓ కె.నిశాంత్, ఉపాధ్యాయులు, క్రీడ శిక్షకులు పాల్గొన్నారు.

ఊర చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని పాత నాగవరం గ్రామంలో నీటి వనరుల పునరుద్ధరణ పథకంలో భాగంగా ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ సౌజన్యంతో ఊర చెరువు పునరుద్ధరణ పనులను స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, సరగడం యోగి నాగేశ్వరరావు, పొలమరశెట్టి మురళి, ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో పలు అంశాలపై నిలదీత

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలే మళ్లీ అడగడం తప్ప... అధికారుల పనితీరులో మార్పు లేదని పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా జరిగిన సమీక్షలో అధికారులు మాట్లాడుతుండగా వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటీసీలు కలుగజేసుకున్నారు. ప్రతి సర్వసభ్య సమావేశాలలో అడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో మండిపడ్డారు. జెడ్పిటిసి కర్రి సత్యం, బి.కింతాడ సర్పంచ్ బూరె బాబురావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ, కలిగోట్ల సర్పంచ్ గొర్రెపోటు సుధారాణి, కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, ఎంపిటీసీలు పంచాడ సింహాచలం నాయుడు, పోతల వెంకట్రావు మాట్లాడుతూ ఏడాది పాటు నుండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్వసభ్య సమావేశాల దృష్టికి తీసుకువచ్చిన వాటిని పరిష్కరించేందుకు అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సమయంలో కలిగొట్ల, బి.కింతాడ సర్పంచ్లు సుధారాణి, బాబురావు విద్యుత్ శాఖ ఏఈ కర్రి శంకర్రావుతో వాగ్వాదానికి దిగారు. వివిధ శాఖలపై జరిగిన సమీక్షంక్ష అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపిడివో ఎంవి సువర్ధరాజు మాట్లాడుతూ సభ్యులు అడిగిన ప్రశ్నలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సర్ది చెప్పారు. గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండానే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఉర్రోకుల గంగ భవాని, డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పారావు, ఏవో లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖ అధికారి బి.వడాల్ దాసు, వ్యవసాయ అధికారిణి కాంతమ్మ, వైద్య అధికారులు పూజ్యమేఘన, గోవింద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

సముద్ర తాబేళ్ల పరిరక్షణకు చర్యలు

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

పర్యావరణ పరిరక్షణలో విశేషపాత్ర పోషిస్తున్న సముద్ర తాబేళ్లను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో శనివారం సముద్ర తాబేళ్ల పరిరక్షణకు తీసుకోవలిసిన చర్యలపై రెవిన్యూ, అటవీ, మత్స్యశాఖ, కాలుష్యనియంత్రణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో సముద్రతాబేళ్ల పాత్ర ఎంతో కీలకమని, వాటిని పరిరక్షించుటకు, వాటి సంతతిని పెంపొందించుటకు కృషి చేయాలన్నారు. తీరప్రాంతంలో గుడ్లు పెట్టడానికి వచ్చే తాబేళ్లను పరిరక్షించడంపై తీరప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చేపల వేటలో తాబేళ్లకు హాని కలుగకుండా చూసేలా తీర ప్రాంత గ్రామాలలోని ప్రజలకు, మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. జిల్లా అటవీ అధికారి ఎం. శామ్యూల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తాబేళ్లు సుదీర ప్రాంతం నుండి డిశంబరు నుండి మే నెల వరకు గుడ్లు పెట్టుటకు జిల్లా తీరప్రాంతానికి వస్తాయని తెలిపారు. తీరప్రాంతానికి చేరుకొనే సమయంలో మరపడవలు, ట్రాలర్ల యొక్క చేపల వలలలో తాబేళ్ళు చిక్కుకుంటాయని, వాటిని మత్స్యకారులు సురక్షితంగా మరల సముద్రంలో విడిచిపెట్టాలని కోరారు. సోషల్ ఫారెస్ట్ డి.ఎఫ్.ఒ. జె.లక్ష్మణ్, ఆర్డిఒలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, యలమంచిలి సబ్ డి.ఎఫ్.ఒ. ఎ.సునీల్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు జి.అనిల్ కుమార్, జ్యోతిర్మయి, మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఐద్వా నాయకులు

అధిక ధరలపై ఐద్వా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-రాంబిల్లి

అధిక ధరలు తగ్గించాలని కోరుతూ రాంబిల్లి మండల కేంద్రంలో అఖిలభారత మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శనివారం సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, 16 రకాల నిత్యవసర వస్తువులు ప్రజలకు అందించాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు అదుపు చేయాలని, ప్రజల మీద ధరలు భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి వందక మంగతాయారు, జిల్లా నాయకులు ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పురోహిత సంఘం సభ్యునిగా గొల్లపూడి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పురోహితుల సంఘం సభ్యులుగా అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన గొల్లపూడి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన బ్రాహ్మణ అర్చక పురోహిత సేవా సంఘం అధ్యక్షుడు దుర్వాసుల రామశాస్త్రి, వేమూరి ఆనంద సూర్య చేతుల మీదుగా రాష్ట్ర కమిటీలో మెంబర్ గా నియమించి నియామక పత్రం అందజేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

కర్పూరీ ఠాకూర్ జయంతి

ప్రజాశక్తి-చోడవరం

బీహార్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు కర్పూరీ ఠాకూర్ జయంతి కార్యక్రమం మండలంలోని వెంకన్నపాలెం నీలాద్రి లేఔట్లో జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం, వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి లర్పించారు. నాయీ బ్రాహ్మణ కులంలో పుట్టి ముఖ్యమంత్రిగా పని చేయడం గర్వించదగ్గ విషయమని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుడివాడ సూరిబాబు, కేశనకుర్తి అప్పారావు, కందికుప్పు గోవిందరావు, దొడ్డవరపు ఈశ్వరరావు, వాయిద్య కళాకారుల సంఘం నాయకులు పేకేటి వరప్రసాద్, పేరూరు సత్యనారాయణ, గోర్మొండ గోవిందు, శివగంగ మ్యూజికల్ ఫండ్ సంఘం అధ్యక్షులు చీపురుపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో శనివారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కన్నూరుపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ దయానా ఆధ్వర్యాన 300 జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ముందుగా టిడిపి కూటమి నాయకులు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ గల్లా రాజు, ఉల్లింగల రమేష్, కాయల మురళి, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపిటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు అన్నారు. మండలంలోని కేపీ అగ్రహారంలో పశు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, దేవర అప్పారావు సంయుక్తంగా ప్రారంభించారు. పశు వైద్యాధికారులు వై.ఉమామహేశ్వరి, సత్యనారాయణ ఆధ్వర్యంలో పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవర ముసలి నాయుడు పాల్గొన్నారు. మండలంలోని పెదపూడిలో కూడా వైద్య శిబిరం నిర్వహించారు.

మునగపాక : మండలంలోని పాటిపల్లి శివారు గొల్లపేటలో శనివారం పశు వైద్య శిబిరం జరిగింది. పశు వైద్య అధికారి డాక్టర్ ప్రదీప్ పశువులకు పలు రకాల వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందార్ల జిల్లా వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు పల్లా సన్యాసిరావు, ఆడారి భాస్కరరావు, పల్లా రమణ, పంచదర్ల పైడయ్య, రైతులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని నునపర్తి గ్రామంలో శనివారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 35 పశువులకు గర్భ కోసం వ్యాధులు చికిత్సలు, 69 గొర్రెలు మేకలకు లేగ దూడలకు నట్టాల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో జెవిటి గంగాధర్, సూపర్వైజర్ కె సుబ్రహ్మణ్యం, ఏహెచ్ఏ ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:మండలంలో అప్పన్నపాలెం గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా ప్రత్యేక అధికారి చల్లయ్య, నర్సీపట్నం సహాయ సంచాలకులు రాంబాబు పాడే రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను వివరించారు. పశువులకు గర్భకోశ చికిత్సలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వేములపూడి పశువైద్యాధికారి నరేష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలోని పీకే పల్లి, పి.గొట్టువాడ గ్రామాలలో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ డైరెక్టర్ చెల్లయ్య మాట్లాడుతూ, పశుగ్రాస క్షేత్రాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చీడికాడ:మండలంలో చుక్కపల్లి, మంచాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు.మాడుగుల ఏరియా పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్. వి. చిట్టి నాయుడు మాట్లాడుతూ, పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు రాఘవమ్మ, గణేష్ రెడ్డి, పశు వైద్య సహాయకులు అర్జున్మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



కోటవురట్లలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి:జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అనకాపల్లి ఎన్టిఆర్ స్టేడియం నుండి గుండాల కూడలి ఎస్ఆర్. శంకరన్ సమావేశ మందిరం వరకు తప్పిట గుళ్ళు, గిరిజన నృత్యం థింసా, కోలాటంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో డిఎస్ఎన్ఎల్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సూర్య ప్రకాష్‌రావు, కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిఆర్ఓ వై.సత్యనారాయణరావు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాల నుండి యువతీ యువకులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. లా వర్సిటీ ఉప కులపతి సూర్య ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని, ప్రతి వ్యక్తి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ షేక్ ఆయిషా, జివిఎంసి జోనల్ కమిషనర్ రమణ, అనకాపల్లి తహసిల్దార్ బి.విజయ కుమార్, యువ ఓటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరిగిన ఓటర్ల దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులు శంకర్రావు మాట్లాడారు.

యలమంచిలి : స్థానిక రెవెన్యూ కార్యాలయం నుండి విద్యార్థులు, అధికార్లు మెయిన్‌రోడ్డు గుండా బస్‌స్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటరు విశిష్టతపై వివిధ కేటగిరీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ, తహశీల్దార్ కె.వరహాలు, డిటిలు వాలేశ్వరరావు, వినయకుమార్, రెవెన్యూ సిబ్బంది, జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎం.లక్ష్మి, ఎంఇఒ కాశీ విశ్వేశ్వరరావు, రెవిన్యూ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : చోడవరంలో ఉషోదయ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎ.రామారావు, డిటి బి.సత్యనారాయణ, ఉషోదయ విద్యాసంస్థల డీన్ ఎస్‌వి.వాసు, పిన్సిపాల్ ఎస్ఎన్.నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు కళాశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ప్రతిజ్ఞ చేశారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ జంక్షన్ వరకు ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీఓ పి.పద్మజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ తహశీల్దార్ కార్యాలయం నుండి జూనియర్ కాలేజీ వరకు ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్‌వి అంబేద్కర్, సిఐ మల్లికార్జునరావు, రెవెన్యూ, మండల పరిషత్తు కార్యాలయ అధికారులు, ఎంఈఓ, జూనియర్ కాలేజీ, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి:ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఆర్ నరసింహమూర్తి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు దేవవరపు కొండలరావు, నున్న సుబ్రహ్మణ్యం, అడ్డూరి ఈశ్వరరావు లను సత్కరించారు. కొత్తగా ఓటుహక్కు పొందిన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు, నాని, ఇన్చార్జ్ ఈవోపీఆర్డీ ఎం శ్రీను, నారాయణరావు పాల్గొన్నారు.

రావికమతం:ఓటర్ల దినోత్సవం వేడుకలను మండల కేంద్రంలో తహసిల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాయుడు, సీనియర్ అసిస్టెంట్, విఆర్వోలు మూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

చీడికాడ: తహసిల్దార్ కార్యాలయం నుంచి చీడికాడ చావిడి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది, యువత పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని నర్సీపట్నంలో అవగాహన ర్యాలీని ఆర్డీవో వీవి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, పౌరుడిగా ఓటు హక్కును వినియోగిచుకోవాలని సూచించారు. విధిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల:ఓటు హక్కును వినియోగించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. అనిత సూచించారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో తహశీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. బస్టాండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాజా, డిటి లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సిద్దేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసిల్దారు తిరుమల బాబు సూచించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి నినాదాలు చేసుకుంటూ ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను, పాఠశాల సిబ్బంది, విఆర్ఓ సంఘ నాయకులు రమేష్, వీఆర్వో అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెందుర్తి ప్రభుత్వ పాఠశాలలో ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధానం గురించి విద్యార్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజ వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ థియో ఫిలిప్, తహశీల్దార్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు

వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేటలో....

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యాన నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మధురవాడ : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు గొట్టేటి రవి వివరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మోహనరావు విద్యార్థులతో ఓటర్ ప్రతిజ్ఞను చేయించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పాషా, నాగమణి, లక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు అనిల్, మురళి ఉపాధ్యాయులు శ్రీను, సోమేశ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఓటర్ల దినోత్సవం సందర్భంగా గాజువాకలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.దయానిధి, గాజువాక తహశీల్దార్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో సుబ్బిరామి కల్యాణమండపంలో ఓటర్ల దినోత్సవాన్ని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. స్థానిక విఆర్ఓ నిడిగట్టు రామకృష్ణ ఆర్ఎంపి వైద్యులకు ఓటు విలువలను తెలియచేస్తూ, ప్రతి ఒక్కరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఇన్‌ఛార్జి జంగం జోషి, జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, కార్యదర్శి కెఎన్.రావు, కనకారావు, రామకోటి, పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బాలశంకరం, రఘు, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజు పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రదర్శించిన ఓటు విలువ పేరుతో ప్రదర్శించిన నాటకం ప్రశంసలు అందుకుంది. ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణతో పాటు విద్యార్థులను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అభినందించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిట్టి వలస జెడ్పీ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల బృందం పర్యవేక్షణలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శివరాణి, ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిల్ సిహెచ్.విష్ణుమూర్తి, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి కె.పార్వతీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.ప్రవీణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఓటు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీలోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఎయు రెక్టార్ ప్రొఫెసర్ ఎన్ కిషోర్ బాబుతో కలిసి జెసి పాల్గొన్నారు. నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతీ, యువకులకు ఓటరు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ భవాని శంకర్, ఆర్‌డిఒ కె.సంగీత్ మధుర్, ఎస్‌డిసిలు ఎస్.మధుసూదన్ బాబు, జె.సీతారామారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం:మండల కేంద్రంలోని నూకాలమ్మ ఆలయం వద్ద మంచి నీటి బోరు పనులను శనివారం గొంప ఎంపిటిసి గెంజి సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ, ఆలయం వద్ద ఎన్నో ఏళ్ల నుంచి మంచినీటి సదుపాయం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎంపీటీసీ నిధులను కేటాయించి బోరును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, చోడవరం నియోజకవర్గ దివ్యాంగుల హక్కుల సాధన కమిటీ కన్వీనర్ గంజి శ్రీనివాసరావు, జనసేన నాయకులు తలాటం సూరిబాబు, రామ సూరి, రావికమతం గ్రామ శాఖ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గెంజి ఈశ్వరరావు, పులగాయల సత్యనారాయణ, వార్డు మెంబరు ఉప్పులూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజనల్ అధికారి సీతామహాలక్ష్మి

పనితీరులో మార్పు రాకుంటే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో విధులు నిర్వహిస్తున్న 20 సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ మేరీరోజ్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా సచివాలయ డివిజనల్ ఆఫీసర్ సీతామహాలక్ష్మి మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో ప్రోగ్రెస్‌లో గొలుగొండ మండలం వెనుకబడి ఉందని, సిబ్బంది పనితీరులో మార్పు కాకపోతే మెమోలు ఇవ్వడం జరుగుతుందని హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని నర్సీపట్నం డివిజన్ స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం స్థానిక ఆర్డీవో వివి రమణ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగం లో పాకలపాడు హైస్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థినిలు పైల జనీల వ్యాసరచన లో ప్రథమ స్థానం గెలుపొందిగా రుత్తల స్వర్ణమాల వకృత్వం లో ద్వితీయ స్థానం పొందారు.



బహుమతి అందిస్తున్న ఆర్‌డిఒ

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో శ్రీగౌరీ పరమేశ్వరులు సారె ఊరేగింపును శనివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాల, వివిధ వేష ధారణల నడుమ సారే ఊరేగింపును ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపరపు చిన్నబాబు, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



సారె ఊరేగిస్తున్న భక్తులు

జీడి మామిడి సాగుదారుల ఆందోళన



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సాగుదారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేటలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన డీ పట్టా భూములలో జీడి మామిడి చెట్లకు పరిహారం చెల్లించాలని సాగుదారులు డిమాండ్ చేశారు. శనివారం నక్కపల్లిలో తహసిల్దార్ కార్యాలయం వద్ద చెట్లకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సాగుదారులు ఆందోళన చేపట్టారు. రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏపీఐఐసీ అధికారుల ఆధ్వర్యంలో సేకరించిన భూములలో పనులు చేపడుతున్నారని, దీనిలో భాగంగా జిరాయితి, డి పట్టా భూములలో కొబ్బరి, జీడి మామిడి మొక్కలను తొలగిస్తున్నారని, జిరాయితీ భూముల్లో ఉన్న చెట్లకు నష్టపరిహారం చెల్లించారని తెలియజేశారు. డి పట్టా భూముల్లో ఉన్న చెట్లకు మాత్రం నష్ట పరిహారం చెల్లించకుండా చెట్లను, తొలగిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. డి పట్టా భూముల్లో ఉన్న చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ, కాలయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పరిహారం చెల్లిస్తారని ఎదురు చూస్తున్నామని, చెల్లించకుండా చెట్లను తొలగిస్తున్నారని, ఇది చాలా అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్బవరం మండలం వంగలి గ్రామంలో సర్వే నెంబర్ 135 లో 270 ఎకరాల్లో పెట్రో యూనివర్సిటీకి సేకరించిన భూములలో డీ పట్టా, సాగు భూములలో తోటలకు, చెట్లకు నష్టపరిహారం చెల్లించారని గుర్తు చేశారు. అదేవిధంగా తమకు కూడా చెట్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసిల్దార్ ఆర్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజయ్యపేట పంచాయతీ వార్డు మెంబర్ మైలపల్లి మహేష్ బాబు, చొక్కా కాశి, పిక్కి గంగరాజు, తాతీలు, పిక్కి కొదండరావు, బొంది గుర్రన్న,కోడా కాశీ రావు, బాపూజీ, అప్పలరాజు, రాజు, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణ గురైందని గురువారం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసిల్దార్ తిరుమల బాబు శనివారం ఆక్రమణ స్థలాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా ఆక్రమదారుడుతో మాట్లాడుతూ, మీ వద్ద ఉన్న ఆధారాలు, రికార్డులు తీసుకొని కార్యాలయంలో హాజరు కావాలని, విచారణ పూర్తి అయ్యేవరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న తహశీల్దార్



పరిశీలిస్తున్న అధికారులు

బ్రిటిష్ సమాధులను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో ఉన్న బ్రిటిష్ సైనిక అధికారుల సమాధుల స్థలాన్ని శనివారం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మన్యం పితూరిలో సమయంలో అల్లూరిని హతమార్చడానికి హైవార్డ్, కవర్డ్ అనే ఇద్దరు సైనిక అధికారులను బ్రిటిష్ ప్రభుత్వం నియమించింది. అల్లూరి సీతారామరాజు వారిద్దరిని హత మార్చడంతో బ్రిటిష్ అధికారులను వారి దేశానికి తరలించలేదని, ఈ కారణంగా నర్సీపట్నంలో సమాధి చేశారు. సమాధుల చుట్టూ ఉన్న 48 సెంట్ల స్థలాన్ని పలువురు ఆక్రమించడంతో ప్రజా సంఘాలు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాలు కోర్టులో కేసులు వేశారు. పురావస్తు శాఖ అధికారులు వచ్చి పరిశీలన చేస్తుంటే సమాధుల స్థలం అభివృద్ధి అవుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్‌బి పట్నంలో పందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

తీర్థాల్లో యథేచ్ఛగా కోడి పందేలు

ప్రజాశక్తి - చీడికాడ:గ్రామాలలో తీర్థ మహోత్స వాల సందర్భంగా కోడిపందాలు జోరుగా సాగుతున్నాయి. కోడిపందాలు నిర్వహించరాదని ఒకపక్క జిల్లా పోలీస్ యంత్రాంగం ఆదేశాలు జారీ చేసినప్పటికీ యథేచ్ఛగా సాగుతున్నాయి. మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి వరుసగా రోజు ఏదో ఒక గ్రామంలో తీర్థ సంబరాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎస్ఎన్ పురం, చిన గోగాడ, పెద్ద గోగాడ, వరాహపురం, అర్జునగిరి, తురువోలు గ్రామాలతో పాటు శనివారం ఎల్బీ పట్నం గ్రామంలో జరిగిన తీర్థంలో కోడిపందాలు జోరుగా సాగాయి.జిల్లా జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికైనా చొరవ చేసుకొని గ్రామాల్లో కోడి పందాలు నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

'ఎట్ హోం' విందుకు ఆహ్వానం

ప్రజాశక్తి- చీడికాడ: రాష్ట్ర రాజధాని అమరావతిలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ "ఎట్ హెూం" అనే విందుకు మంచాల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మికి ఆహ్వానం అందింది.విద్యా రంగంలో కృషికి గాను ఎంపిక చేశారని ఈ మేరకు ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి విలేకరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లితండ్రుల సహకారం, అధికారుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని వెంకటలక్ష్మి తెలిపారు. ఈ విందును గౌరవంగా భావిస్తానని ఆమె తెలిపారు.

డిఎస్‌పికి సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం నియోజక వర్గంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు పరచాలని నూతనంగా నియమితులైన డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాస్‌రావును శనివారం రాష్ట్ర రిలే హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మర్యాద పూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు ఎర్రం శెట్టి పాపారావు. జిల్లా జీవీఎంసీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు, డివిజన్ జీవీఎంసీ సభ్యుడు చలపతిరావు నూకరాజు పాల్గొన్నారు.

రాజీనామా పేరుతో డ్రామాలు

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్



ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రాజీనామా పేరుతో తప్పించుకునేందుకు ఎంపీ విజయసాయిరెడ్డి ప్రయత్నిస్తున్నారని, సీఎం జగన్‌తో కలిసి డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ విమర్శించారు. విజయ్ సాయి రెడ్డి రాజీనామా పై శనివారం నర్సీపట్నం తన నివాసంలో చింతకాయల విజయ్ మాట్లాడుతూ, వైసిపి పార్టీ భూస్థాపితం అవుతుందనే సంకేతం విజయ్ సాయి రెడ్డి రాజీనామేనన్నారు. భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలు వైసీపీని వదిలిపెట్టే పరిస్థితి వస్తుందని తెలిపారు.విజయసాయిరెడ్డి చేసిన అక్రమాలపై తానే స్వయంగా పిర్యాదు చేస్తానన్నారు. అశోక్ గజపతిరాజు ఆస్తులను కాజేయడం కోసం సింహాచలం దేవస్థానం చైర్మన్‌గా వేరే వ్యక్తిని నియమించారని, ఆస్తుల కోసం హింసించిన వ్యక్తి విజయసాయిరెడ్డేనని ఆరోపించారు. దసపల్లా ఆస్తుల కబ్జా, వాల్తేర్ క్లబ్ సంఘటనలు విశాఖ ప్రజలు మరిచిపోలేరన్నారు. టీడీపీ నాయకులు కళా వెంకటరావు, ఆచ్చెన్నాయుడులను అన్యాయంగా అరెస్టు చేయించారని, పార్టీ నాయకులను టార్గెట్ చేశారని పేర్కొన్నారు.వైసీపీ నాయకులు చేసిన ప్రతి అక్రమంపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : బండారు



పర్యటిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- మాడుగుల:ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలకు చేరువచేసే దిశగా నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండాలని మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణ మూర్తి సూచించారు. శనివారం మాడుగుల శివారు తాచేరు కాలువ సమీపంలో గల పంచాయతీరాజ్ అతిది గృహంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీకి సంబందించిన అనేక కార్యక్రమాలను వివరించారు. మాడుగుల పంచాయతీ పరిధిలో దుర్గాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న చికెన్ దుకాణాల స్థానంలో షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. అక్కడి దుకాణాలను తొలగించి వేరొ చోటుకి మార్పు చెయ్యాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. అనంతరం మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వెనుక కోడూరు దారిలో కోల్డ్ స్టోరేజ్ లను పరిశీలించారు.మోదమాంబ కాలనీ దారిలో వ్యవసాయ మార్కెట్ యార్డులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పుష్పాలు అప్పలరాజు, పట్టణ అధ్యక్షులు రంజిత్ వర్మ, ఉండూరు దేముడు, పుప్పాల రమేష్ డిల్లీ నానాజీ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఎల్ పిఓ ఎస్ ఎస్ ఎన్ మూర్తి సూచించారు. నక్కపల్లిలో శనివారం ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణం, తదితర ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశు భ్రతను పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓపిఆర్‌డి ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు



సమావేశానికి హాజరైన సభ్యులు

సాఫీగా మండల సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు అధికారులు ప్రభుత్వం చేపట్టిన పనులు, వివరాలు వెల్లడించారు. విద్యుత్ శాఖ అధికారి పరమేశ్వరరావు మాట్లాడుతూ, సోలార్ విద్యుత్ పట్ల ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీపై వివరించారు. జలజీవన్ మిషన్ పనుల జాప్యంతో తాగునీటి అవస్థలపై పలువురు ఎంపీటీసీ సభ్యులు సభలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వ్యవసాయ శాఖ అధికారి సరోజిని ధాన్యం కొనుగోలు వివరాలు, చెల్లింపులపై తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ, ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. సర్వ శిక్ష అభియాన్ ఏఈ మూర్తి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తున్న తరుణంలో టిడిపి నాయకులు చెప్పిన వారికి పనులు అప్పగించడం జరుగుతుందని చెప్పడంతో టిడిపి, వైసిపి నాయకుల మధ్య కాస్త ఘర్షణ చోటు చేసుకుంది. పల్లె పండుగలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మండల పంచాయతీరాజ్ ఇంజనీర్ వర్మ చేపడుతున్న పనుల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, వైస్ ఎంపీపీ సుజాత, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి పాల్గొన్నారు